దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు షురూ


మీరాలంమండిలో పూజల్లో పాల్గొన్న గాజుల అంజయ్య


బాలాత్రిపుర సుందరి దేవి రూపంలో అమ్మవారు


బాల త్రిపుర సుందరీ దేవిగా సంజయ్‌నగర్ నల్లపోచమ్మ


బాల త్రిపుర సుందరీ దేవిగా జియాగూడ మహంకాళి


పూజల్లో ఆలయ కమిటీ అధ్యక్షుడు ఎర్మనీ కైలాష్ గంగపుత్ర దంపతులు

దసరా పండుగను పురస్కరించుకొని దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు గురువారం భక్తిశ్రద్ధలతో ప్రారంభమయ్యాయి. ఉదయం నుంచే అమ్మవారి ఆలయాలు, మండపాలు భక్తులతో కిటకిటలాడాయి. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు, హోమాల నిర్వహించారు. మొదటి రోజు అమ్మవారు బాలాత్రిపుర సుందరిదేవి రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఆలయాల, మండపాల నిర్వాహకులు అన్ని ఏర్పాటు చేశారు. – చార్మినార్, అబిడ్స్, మెహిదీపట్నం జోన్ల బృందం


చార్మినార్ భాగ్యలక్ష్మి అమ్మవారి ఆలయం వద్ద జరిగిన హారతికి హాజరైన భక్తులు


పూజల్లో ఎస్.రాజు వస్తాద్ తదితరులు


ఉప్పుగూడలో ఆలయ కమిటీ చైర్మన్ మధుసూదన్‌గౌడ్ దంపతులు


విద్యుత్ కాంతులతో సుల్తాన్‌షాహీ జగదాంబ ఆలయం


హిందూ సేవా సమాజ్ ఆధ్వర్యంలో.. రాజువస్తాద్, శోభాపాండే


హోమం చేస్తున్న ఆలయ అధ్యక్షుడు నాగేందర్, ఉపాధ్యక్షులు గిరిధర్ తదితరులు


బాలత్రిపుర సుందరి దేవీగా మీరాలంమండి అమ్మవారు

ఉస్మానియాలో డెర్మటాలజీ ట్రైనింగ్ సెంటర్ ప్రారంభం


ట్రైనింగ్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న ఉస్మానియా మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ నరేంద్రకుమార్

సుల్తాన్‌బజార్: చిన్నపిల్లల్లో వచ్చే చర్మవ్యాధుల చికిత్సకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వైద్యులకు ఇచ్చే శిక్షణ కేంద్రాన్ని ఉస్మానియా వైద్య కళాశాల ప్రిన్సిపాల్ గురువారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ వైద్య కళాశాలలో దేశంలోనే మొట్టమొదటిసారిగా చిన్నపిల్లల్లో వచ్చే చర్మవ్యాధుల చికిత్స శిక్షణ శిబిరాన్ని ఉస్మానియాలో ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. ఈ శిక్షణ శిబిరం వల్ల వ్యాధులను త్వరగా గుర్తించి చికిత్స అందజేయడం జరుగుతుందన్నారు. శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేయడానికి కృషి చేసిన డెర్మటాలజీ ప్రధానాచార్యులు డాక్టర్ భూపేష్‌కుమార్‌ను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉస్మానియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాకేష్ కుమార్ సహాయ్, డాక్టర్ కవిత, డాక్టర్ రాజీవ్ సింగ్, డాక్టర్ అరుణ, డాక్టర్ సుధీర్, ఆర్ఎంఓ జయకృష్ణ, డాక్టర్ రఫీ తదితరులు పాల్గొన్నారు.

ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది కలిసికట్టుగా పని చేయాలి


ఎమ్మెల్యే కౌసర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న డాక్టర్ పి.వి.శ్రీనివాసరావు

గోల్కొండ: గోల్కొండ ఏరియా ఆసుపత్రికి రాష్ట్ర స్థాయి గుర్తింపు వచ్చేలా ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది కలిసికట్టుగా పని చేయాలని ఎమ్మెల్యే కౌసర్‌మొహియుద్దీన్ అన్నారు. గోల్కొండ ఆసుపత్రికి కేంద్ర ప్రభుత్వం ఇచ్చే కాయకల్ప్ అవార్డు వచ్చిన సందర్భంగా ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.వి.శ్రీనివాసరావు గురువారం ఎమ్మెల్యేను కలిసి శాలువా కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..వైద్యులు సూపరింటెండెంట్ సారథ్యంలో బాగా పని చేస్తున్నారన్నారు. గత ప్రభుత్వ హయాంలో ఆసుపత్రి నూతన భవనానికి గ్రీన్ సిగ్నల్ వచ్చిందని మరి కొన్ని నెలల్లో ఆసుపత్రికి అదనపు భవన నిర్మాణ పనులు ప్రారంభమవుతాయని ఆయన అన్నారు. జిల్లా కలెక్టర్‌తో పాటు వైద్య శాఖ అధికారులు సైతం పలుమార్లు ఆసుపత్రిని సందర్శించి వైద్యుల సేవలను, ఆసుపత్రి పనితీరును మెచ్చుకున్నారన్నారు.

న్యాయవాదిపై దాడి చేసిన మాదన్నపేట్ పోలీసులపై చర్యలు తీసుకోవాలి


నిరసన వ్యక్తం చేస్తున్న న్యాయవాదులు

యాకుత్‌పురా: న్యాయవాదిపై దాడికి పాల్పడిన మాదన్నపేట్ పోలీసులపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని హైదరాబాద్ సిటీ సివిల్ కోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వై. శ్రీనివాసా చారి, ఉపాధ్యక్షురాలు ప్రవీణారెడ్డి, ప్రధాన కార్యదర్శి దుబ్బాక హర్షవర్ధన్, సంయుక్త కార్యదర్శి బర్కా రాజేష్ కుమార్ డిమాండ్ చేశారు. న్యాయవాది మహ్మద్ అబ్దుల్ కలీంపై బుధవారం మాదన్నపేట్ పోలీసులు చేసిన దాడికి నిరసనగా కోర్టు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం న్యాయవాదులు విధులు బహిష్కరించి నిరసన వ్యక్తం చేశారు. వారు మాట్లాడుతూ..దాడికి పాల్పడిన ఇన్‌స్పెక్టర్, ఎస్సై, సిబ్బందిపై ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. న్యాయవాదులు జశ్వంత్ కౌర్, సుదర్శన్, విశాల్, శివకుమార్ దాస్, పాండయ్య, ప్రవీణ్ పాల్గొన్నారు.

కేటీఆర్ దిష్టిబొమ్మ దహనం


కేటీఆర్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న సునీతారావు

నాంపల్లి: కేటీఆర్ వ్యాఖ్యలను నిరసిస్తూ మహిళా కాంగ్రెస్ ఆధ్వర్యంలో గురువారం నాంపల్లి చౌరస్తాలో కేటీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సునీతారావు నేతృత్వంలో జరిగిన నిరసన కార్యక్రమంలో కాంగ్రెస్ మహిళా నేతలు పెద్ద ఎత్తున హాజరయ్యారు. కేటీఆర్ వెంటనే క్షమాపణలు చెప్పాలని కోరారు. మహిళలపై అనుచిత వ్యాఖ్యలు మానకపోతే చెప్పు దెబ్బలు తప్పవని హెచ్చరించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో సైతం బీఆర్ఎస్ జీరో కే పరిమితం అవుతారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా అధ్యక్షురాలు ఆర్.లక్ష్మి, ఖైరతాబాద్ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీ, మహబూబాబాద్ జిల్లా అధ్యక్షురాలు రాధ, మహిళా నేతలు గోవిందమ్మ, శైలజ, సుగుణ పాల్గొన్నారు.

బషీర్‌బాగ్ చౌరస్తాలో..

గన్‌ఫౌండ్రీ: బడుగు బలహీన వర్గాలకు చెందిన మహిళా మంత్రులపై బీఆర్ఎస్ సోషల్ మీడియాలో అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా బషీర్‌బాగ్ చౌరస్తాలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి సీహెచ్. శ్రీనివాస్ ఆధ్వర్యంలో మాజీ మంత్రి కేటీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు రాహుల్, భాస్కర్, మహేష్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


బషీర్‌బాగ్ చౌరస్తాలో కేటీఆర్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న కాంగ్రెస్ శ్రేణులు

టీఎఫ్‌సీఓ మహిళా విభాగాన్ని పటిష్టం చేయాలి


మహ్మద్ నజీబ్‌తో రాష్ట్ర మాజీ మహిళా కమిషన్ చైర్మన్ ఆయేషా బేగం

గోల్కొండ: తెలంగాణ ఫ్యామిలీ కౌన్సెలింగ్ ఆర్గనైజేషన్ మహిళా విభాగాన్ని పటిష్టం చేయాలని ఉమ్మడి తెలుగు రాష్ట్ర మహిళా కమిషన్ మాజీ చైర్మన్ ఆయేషా బేగం అన్నారు. గురువారం ఆమె టోలిచౌకీ అక్బర్ బాగ్‌లోని టీఎఫ్‌సీవో కార్యాలయంలో మహిళా విభాగం ఏర్పాటు కోసం చైర్మన్ మహ్మద్ నజీబ్‌ను కలిశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఆర్గనైజేషన్ 15 ఏళ్లుగా సమర్థవంతంగా పని చేస్తూ ప్రజల మననలు పొందిందన్నారు. ప్రతి జిల్లాకు టీఎఫ్‌సీఓ మహిళా అధ్యక్షురాలును నియమించి వాటిలో చురుకైన యువతులను కౌన్సిలర్లుగా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో టీఎఫ్‌సీఓ రాష్ట్ర కార్యాలయ ఇన్‌చార్జి మహ్మద్ ఫహద్ ఉన్నారు.

వాటర్‌బోర్డు ఉద్యోగుల సంక్షేమానికి కృషి


లక్ష్మీనారాయణను సత్కరిస్తున్న యూనియన్ నాయకులు

అబిడ్స్: వాటర్‌బోర్డు ఉద్యోగుల సంక్షేమానికి ప్రత్యేక కృషి చేస్తానని వాటర్‌బోర్డు ఎంప్లాయీస్ యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ జి.లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. వాటర్‌బోర్డులో పెండింగ్‌లో ఉన్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి వెంటనే పరిష్కరిస్తున్నట్లు వెల్లడించారు. ఉద్యోగుల సంక్షేమమే పరమావధిగా భావించి ఎంప్లాయీస్ యూనియన్ ముందుకు పోతుందన్నారు. లక్ష్మీనారాయణ జన్మదిన వేడుకలను పురస్కరించుకొని ఉద్యోగులు, యూనియన్ నాయకులు ఆయనను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ..జీవితాంతం ఉద్యోగుల సంక్షేమానికి, ప్రజా సంక్షేమానికి కృషి చేస్తానన్నారు.

‘బీజేపీ ప్రభుత్వం రైతులను దగా చేస్తోంది’


మాట్లాడుతున్న గౌరీ సతీష్

అఫ్జల్‌గంజ్: రైతులను కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అన్నివిధాల దగా చేసిందని టీపీసీసీ అధికార ప్రతినిధి గౌరీ సతీష్ పేర్కొన్నారు. దేశంలోని పలు రాష్ట్రాలో బీజేపీ ప్రభుత్వాలు అధికారంలో ఉన్నాయని ఏ ఒక్క రాష్ట్రంలోనైనా రైతులకు రైతు రుణ మాఫీ కానీ, రైతుబంధు ఇచ్చారా..? అని ఆయన ప్రశ్నించారు. ఎన్నికలప్పుడే ప్రజలకు మాయమాటలు చెప్పి ఓట్లు దండుకునే బీజేపీ నాయకులకు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శించే అర్హత లేదన్నారు. దేశంలోనే ఎక్కడా లేని విధంగా సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం తెలంగాణలో రైతుల కోసం రెండు లక్షల రూపాయాలు రుణమాఫీ చేస్తే జీర్ణించుకోలేని బీజేపీ రాష్ట్ర నాయకులు దొంగ దీక్షలు చేశారన్నారు. ఇలాంటి దీక్షలు బీజేపీ పాలిత ప్రాంతాల్లో చేస్తే రైతులకు లాభం చేకూరుతుందని గౌరి సతీష్ పేర్కొన్నారు. దమ్ముంటే రాష్ట్ర బీజేపీ అగ్ర నాయకులు ప్రధాని నరేంద్రమోదీతో మాట్లాడి రైతుల కోసం కేంద్రం తరఫున కూడా రుణమాఫీలు ఇప్పించాలని ఆయన డిమాండ్ చేశారు.

వైభవంగా బతుకమ్మ వేడుకలు


త్రివేణి సంగంలో బతుకమ్మలు వదులుతున్న బాలరాజు తదితరులు

లంగర్‌హౌస్: బతుకమ్మ సంబరాలు వాడవాడలా కనులపండువగా జరిగాయి. లంగర్‌హౌస్ త్రివేణి సంగం వద్ద మహిళలు, ఆడపడుచులు బతుకమ్మ పాటలు పాడుతూ ఆడారు. సంగం ఆలయం వెనక బతుకమ్మ ప్రాంగణంలో దసరా ఉత్సవ సమితి అధ్యక్షుడు బోగి బాలరాజ్ ఆధ్వర్యంలో బతుకమ్మ సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనతో పాటు కమిటీ సభ్యులు బతుకమ్మ ఆడి ఆడపడుచులకు సేవగా బతుకమ్మలను త్రివేణి సంగంలో వదిలి సహాయపడ్డారు.

చురుగ్గా బీజేపీ సభ్యత్వ నమోదు


సభ్యత్వ నమోదు కార్యక్రమంలో కార్పొరేటర్ ఆలే భాగ్యలక్ష్మి తదితరులు

గౌలిపురా: గౌలిపురా డివిజన్‌లోని గాంధీబొమ్మ వద్ద బీజేపీ ఓబీసీ మోర్చా భాగ్యనగర్ జిల్లా, గౌలిపురా డివిజన్ ఆధ్వర్యంలో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ ఆలే భాగ్యలక్ష్మి, బీజేపీ ఓబీసీ మోర్చా కార్యదర్శి, కార్యాలయం ఇన్‌చార్జి ప్యారసాని వెంకటేశ్ పాల్గొని సభ్యత్వాలను అందజేశారు. ఓబీసీ మోర్చా కార్యదర్శి మోకాళ్ల వెంకటేశ్, భాగ్యనగర్ జిల్లా ప్రధాన కార్యదర్శి జమాల్‌పూర్ శేఖర్, ఓబీసీ మోర్చా జిల్లా ఇన్‌చార్జి మల్లేష్, శ్రీనివాస రామాపురం, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షులు విజయ కుమార్, బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి ఇ.సుమన్ కుమార్ ముదిరాజ్, డివిజన్ అధ్యక్షులు జి.రఘుకాంత్, ప్రేమ్ కుమార్, ఓబీసీ మోర్చా డివిజన్ అధ్యక్షులు సాయి కుమార్ పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి


చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ మేరాజ్, కార్పొరేటర్లు

యాకుత్‌పురా: సంక్షేమ పథకాలను అర్హులందరూ సద్వినియోగం చేసుకోవాలని యాకుత్‌పురా ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ మేరాజ్ మండల పరిధిలో షాదీముబారక్, కల్యాణలక్ష్మి పథకాల ద్వారా మంజురైన 70 చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఆర్థిక సమస్యలతో బాధపడుతున్న పేద ప్రజలకు సంక్షేమ పథకాలు ఎంతో బాసటగా నిలుస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో తలాబ్‌చంచలం, రెయిన్‌బజార్, సంతోష్‌నగర్ డివిజన్ల కార్పొరేటర్లు డాక్టర్ సమీనాబేగం, మహ్మద్ వసీవుద్దీన్, ముజఫర్ హుస్సేన్, మజ్లిస్ పార్టీ నాయకులు, మండల కార్యాలయం అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

మహేష్‌కుమార్ గౌడ్‌కు సన్మానం


మహేష్‌కుమార్ గౌడ్‌ను సన్మానిస్తున్న ధన్‌రాజ్, సతీష్‌కుమార్

అబిడ్స్: రాష్ట్ర టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్‌ను గోషామహల్ నియోజకవర్గానికి కాంగ్రెస్ నాయకులు ఎస్. ధన్‌రాజ్, సతీష్‌కుమార్ ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..సీఎం రేవంత్‌రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో అగ్రగామిగా ముందుకు వెళ్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకుడు ఎం.అరవింద్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అగ్రసేన్ మహరాజ్ జయంతి



చార్మినార్: అగ్రసేన్ మహరాజ్ జయంతిని గురువారం పాతబస్తీలో ఘనంగా నిర్వహించారు. చార్‌కమాన్‌లో జరిగిన వేడుకల్లో హైదరాబాద్ కుంభ మేళా అగర్వాల్ బంధు, అశోక్ ఫౌండేషన్ అధ్యక్షుడు పంకజ్‌కుమార్ అగర్వాల్ పాల్గొని అగ్రసేన్ మహరాజ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అగ్రసేన్ మహరాజ్ చేసిన సేవలను కొనియాడారు.

భక్తిభావంతో శరన్నవరాత్రి ఉత్సవాలు నిర్వహించాలి


కాశీబుగ్గ బాబన్న


జియాగూడ: భక్తిభావంతో శరన్నవరాత్రి ఉత్సవాలు నిర్వహించుకోవాలని సనాతన హిందూ ఆలయాల పరిరక్షణ సమితి తెలంగాణ రాష్ట్ర కోశాధికారి కాశీబుగ్గ బాబన్న, కార్వాన్ నియోజకవర్గం అధ్యక్షుడు చంద్రశేఖర్ అన్నారు. గురువారం జియాగూడలోని సమితి కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ..వేడుకల్లో మండపాల వద్ద భజన కీర్తనలు నిర్వహించడంతో పాటు దాండియా, గర్బా కార్యక్రమాలను చేపట్టాలన్నారు. మాతా జాగరణ్, సామూహిక కుంకుమార్చనలు, ఒడిబియ్యాలు సమర్పన, రాత్రికి 8 గంటలకు సామూహిక అఖండ హారతి నిర్వహించాలన్నారు.

వృద్ధులకు ఉచితంగా కంటి పరీక్షలు



జియాగూడ: వరల్డ్ సీనియర్ సిటిజన్స్ డేను పురస్కరించుకొని ఏవీ కళాశాలలో గురువారం ఉచిత మెగా హెల్త్ క్యాంప్ నిర్వహించారు. దోమలగూడ లయన్స్ సాధురామ్ ఐ హాస్పిటల్ డాక్టర్స్ 202 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా 12 మందికి కేటరక్ట్ ఆపరేషన్ చేయాల్సిందిగా గుర్తించారు. వెంటనే ఆరుగురుని హాస్పిటల్‌లో అడ్మిట్ చేశారు. ఈ కార్యక్రమంలో లయన్ కిషోర్ చాబ్బరియా, లయన్ ప్రమోద్ గోపిశెట్టి, లయన్ ఆకుల రవీందర్‌రావు, లయన్ శ్రీనివాస్‌రావు పాల్గొన్నారు.

రోగులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు


డాక్టర్ రాకేష్ సహాయ్

అఫ్జల్‌గంజ్: ఉస్మానియా జనరల్ ఆసుపత్రికి పెరిగిన రోగుల రద్దీకి అనుగుణంగా అన్ని విభాగాల అధికారులతో సమన్వయం చేస్తూ ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాకేష్ సహాయ్ అన్నారు. ఆయన ఇటీవలే పూర్తిస్థాయి సూపరింటెండెంట్‌గా బాధ్యతలు స్వీకరించారు. గురువారం విలేకర్ల సమావేశం నిర్వహించారు. రెండు నెలలుగా పెండింగ్‌లో ఉన్న ఆరోగ్యశ్రీ పేషంట్ కేర్, అవుట్ సోర్సింగ్, ప్రభుత్వ ఉద్యోగుల జీతభత్యాల ఫైళ్లను క్లియర్ చేసినట్లు తెలిపారు. ఆసుపత్రిలో స్థలాభావం ఉన్నా ఎక్కువ సంఖ్యలో రోగులకు కార్పొరేట్ తరహా వైద్య సేవలు అందిస్తున్నామన్నారు.

మూసీ బాధితులకు అండగా ప్రభుత్వం



- మూసీ సుందరీకరణలో భాగంగా ఇప్పటికే ఆక్రమణల గుర్తింపు
- ఇప్పటికే నాంపల్లి, హిమాయత్‌నగర్ మండలాల్లో ఆక్రమణల తొలగింపు
- పిల్లి గుడిసెలు, జియాగూడలలో డబుల్ బెడ్ రూం కేటాయింపు.. తరలింపు పూర్తి
- సాక్షి ఇంటర్వ్యూలో హైదరాబాద్ జిల్లా ఆర్డీఓ కూరెళ్ల మహిపాల్‌రెడ్డి

చార్మినార్: మూసీ రివర్ బెడ్ ఆక్రమణల బాధితులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని.. ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని హైదరాబాద్ జిల్లా ఆర్డీఓ కూరెళ్ల మహిపాల్‌రెడ్డి తెలిపారు. మూసీ సుందరీకరణలో భాగంగా చేపట్టిన మూసీ నదిలోని ఆక్రమణలను తొలగించడం కోసం ఇప్పటికే స్పెషల్ డ్రైవ్ నిర్వహించి తొలగించాల్సిన కట్టడాలను గుర్తించామన్నారు. హిమాయత్‌నగర్ మండల పరిధిలోని బాధితులతో పాటు నాంపల్లి మండల పరిధిలోని బాధితులకు టూబీహెచ్‌కే డిగ్నిటీ హౌసింగ్ కాలనీలలో డబుల్ బెడ్ రూంలను కేటాయించామన్నారు. తమ పరిధిలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన టీంలతో సర్వే నిర్వహించి మూసీలో 1595 ఆక్రమణలను గుర్తించగా..ఇందులో క్షేత్ర స్థాయిలో అర్హులైన 824 మంది కుటుంబాలకు 2 బీహెచ్‌కే డిగ్నిటీ హౌసింగ్ కాలనీలో డబుల్ బెడ్ రూంల అవసరం ఉంటుందని తేల్చాం. తమ ఇళ్లను కోల్పోతున్న అర్హులైన వారికీ డబుల్ బెడ్ రూం ఇళ్ల కేటాయింపులతో పాటు తాజాగా రూ.25 వేలు ఖర్చుల నిమిత్తం అందజేయడం జరుగుతుందని ఆయన ‘సాక్షి’కి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో తెలిపారు.

ఇప్పటి వరకు ఏఏ మండలాల్లో ఎక్కడెక్కడ డబుల్ బెడ్ రూంలను కేటాయించారు.

◆ నాంపల్లి మండలంలోని బాధితులకు జియాగూడ డబుల్ బెడ్ రూంలను.. హిమాయత్‌నగర్ మండలంలోని శంకర్‌నగర్ బస్తీవాసులకు పిల్లి గుడిసెలు డబుల్ బెడ్ రూంలను కేటాయించాం.

అన్ని ప్రాంతాల్లోని మూసీ బాధితుల ఇళ్లకు రెడ్ మార్క్ వేశారా..?

◆ లేదు.. కిషన్‌బాగ్, పురానాపూల్, లంగర్‌హౌస్, గోల్నాక తదితర ప్రాంతాల్లో వేయాల్సి ఉంది.

ఎందుకు అక్కడి వారు అంగీకరించడం లేదా..?

◆ వారికి నచ్చ చెప్పడానికి కొంత సమయం పడుతుంది. అయితే ముందుగా స్వచ్ఛందంగా ముందుకు వస్తున్న వారి కట్టడాలను గుర్తించి వెంటనే వారందరికీ ఆలస్యం లేకుండా యుద్ధ ప్రాతిపదికన డబుల్ బెడ్ రూంలను కేటాయిస్తున్నాం.

అక్కడక్కడ కొంత మంది బాధితులు ఆందోళనలు సైతం చేస్తున్నారుగా..?

◆ అవును. మూసీ సుందరీకరణ అనేదీ పెద్ద ప్రాజెక్ట్. దీనిపై ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉంది. చాలా వరకు సహకరిస్తున్నారు. ప్రభుత్వ పాలసీని చాలా వరకు స్వాగతిస్తున్నారు.

ఏఏ మండల్లో ఎన్నెన్ని కట్టడాలను గుర్తించారు..? ఎన్ని డబుల్ బెడ్ రూంలు అవసరం ఉంటాయని గుర్తించారు..?

◆ నాంపల్లి మండల పరిధిలో 653 కట్టడాలను గుర్తించగా..వీరికి క్షేత్ర స్థాయిలో 369 డబుల్ బెడ్ రూంలు అవసరం ఉండగా..277 ఇవ్వడానికి క్షేత్ర స్థాయిలో నిర్ధారించాం. గోల్కొండ మండలంలో 50 ఆక్రమణలను గుర్తించగా.. క్షేత్ర స్థాయిలో 9 అవసరం ఉంటున్నాయి. ఆసిఫ్‌నగర్ మండలంలో 14 గుర్తించగా..2 గాను, సైదాబాద్ మండలంలో 70 గుర్తించగా..72 అవసరం ఉన్నాయి, అంబర్‌పేట్‌లో 64 గుర్తించగా.. క్షత్ర స్థాయి పరిశీలనలో 7 గాను, చార్మినార్‌లో 3 గుర్తించినప్పటికీ.. డబుల్ బెడ్ రూం అవసరం లేదు. ఇక బహదూర్‌పురా మండలంలో 527 గుర్తించగా.. క్షేత్ర స్థాయిలో 306, హిమాయత్‌నగర్‌లో 263 గుర్తించగా..151 డబుల్ బెడ్ రూంలు అవసరం ఉన్నాయి. ఇందులో ఇప్పటికే నాంపల్లి మండలంలో 25, హిమాయత్‌నగర్ మండలంలో 143 డబుల్ బెడ్ రూంలను కేటాయించాం.

ఆర్‌బీ–ఎక్స్ అంటే ఏమిటి..?

◆ రివర్ బెడ్ అని తెలియజేస్తునే..ఆయా కట్టడాన్ని(ఎక్) తొలగించడం అని అర్థం.